క్లుప్తంగా

హెచ్‌ఎంకు సన్మానం



జయలక్ష్మిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

తుగ్గలి : ఉపాధ్యాయ వృత్తి పట్ల అంకితభావంతో పనిచేసిన హెచ్‌ఎం జయలక్ష్మి విద్యార్థులు, తల్లిదండ్రుల మన్ననలు పొందారని ఎంఈవో–2 రామవెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం బి.జయలక్ష్మి పదవీ విరమణ సన్మానం కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం బాబురావు, జొన్నగిరి, రాతన, ఎద్దులదొడ్డి హెచ్‌ఎంలు ఉపేంద్ర, అరుణకుమారి, జాకీర్‌హుసేన్, ఎస్‌ఎంసీ చైర్మన్ రంగస్వామి పాల్గొన్నారు.

తగ్గుతున్న టమాట ధర

పత్తికొండ(తుగ్గలి) : టమాట ధర రోజు రోజుకు తగ్గిపోతోంది. బుధవారం పత్తికొండ మార్కెట్ యార్డుకు 820 క్వింటాళ్ల టమాట పంట విక్రయానికి వచ్చింది. కిలో టమాట గరిష్టంగా రూ.20.10 పలికింది. కనిష్టంగా రూ.10, మధ్య ధర రూ.15 చొప్పున అమ్మకాలు జరిగాయి. ధరలు తగ్గుతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

అనుమతి ఉంటేనే టపాసులు విక్రయించాలి

చిప్పగిరి: ప్రభుత్వ అనుమతి పొందిన వారు మాత్రమే టపాసులు విక్రయించాలని ఎస్‌ఐ సతీష్ కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ టపాసులు అక్రమంగా నిల్వ ఉంచినా, నిబంధనలు అతిక్రమించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం సూచించిన ప్రదేశాల్లో మాత్రమే బాణసంచా విక్రయించాలని చెప్పారు. విక్రయ దారులు అగ్నిమాపక సామగ్రి అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఏదైనా ప్రమాదాలు సంభవిస్తే 100,లేదా 112 కు ఫోన్ చేయాలని సూచించారు.

హక్కులను రక్షించాలి

కృష్ణగిరి: పౌర హక్కులను కాపాడి, ప్రతి పౌరుడికి న్యాయం చేయాల్సిన బాధ్యత అధికారులదేనని జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఎరుకల రాజు అన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలో తహసీల్దార్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్‌ఐ మనోహర్, కంబాలపాడు ఎస్సీ హాస్టల్ వార్డెన్ వెంకటేశ్వర్లు, వీఆర్వో వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి చిన్న లచ్చప్ప పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్ అవకతవకలపై విచారణ



విచారిస్తున్న విజిలెన్స్ అధికారులు

దేవనకొండ: మండలంలోని పి.కోటకొండ గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులు పక్కదోవ పట్టించారని సోమవారం ప్రజాదర్బార్‌లో కలెక్టర్‌కు కొందరు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం జిల్లా విజిలెన్స్ అధికారులు లోకేశ్వర్, ఏపీడీ పక్కీరప్ప గ్రామానికి చేరుకున్నారు. పి.కోటకొండ పంచాయతీ పరిధిలో ఉపాధిహామీ పథకం కింద జరిగిన పనులు, అవినీతిపై వివరాలు సేకరించారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపుతామని చెప్పారు.

ఘనంగా ఉరుసు

హొళగుంద: మండలంలోని కొత్తపేట గ్రామ సమీపంలో వెలిసిన షేక్ బిర్దర్ దాదా 364వ ఉరుసు బుధవారం ఘనంగా జరిగింది. ఉత్సవాలను తిలకించడానికి చుట్ట పక్కల గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చారు. తాత సమాధిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున గంధం ఊరేగింపుగా దర్గాకు చేరడంతో భక్తులు ఫాతెహాలు చేశారు. గురువారం జియారత్‌తో వేడుకలు ముగుస్తాయని ముజవర్లు తెలిపారు.

పాఠశాల తనిఖీ

హొళగుంద: మండలంలోని గజ్జహళ్లి ఎంపీపీ పాఠశాలను ఎంఈఓ–2 సత్యనారాయణ బుధవారం తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలు, మెనూ పాటిస్తున్నారా లేదా తదితర వాటి గురించి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని సక్రమంగ వడ్డించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీలకు సూచించారు.

వ్యాస రచన పోటీల్లో విద్యార్థి ప్రతిభ



బహుమతి అందజేస్తున్న ఆదోని సబ్ కలెక్టర్

హొళగుంద: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఎస్‌ఎస్ సందేశ అనే విద్యార్థి వ్యాస రచన పోటీల్లో జిల్లా స్థాయిలో మొదటి బహుమతి సాధించాడు. ఈ నెల 21వ తేదీన కర్నూలులో గర్భస్థ పిండశిశువు రక్షణ చట్టంపై జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అందులో పాల్గొన్న సందేశ మొదటి స్థానంలో నిలిచాడు. బుధవారం విద్యార్థికి ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ రూ5వే నగదు, షీల్డ్, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. హెచ్‌ఎం నజీర్, టీచర్లు అభినందించారు.

ప్రమాద రహితంగా పండుగ చేద్దాం

- బాణాసంచా కాల్చే సమయంలో అప్రమత్తంగా ఉండాలి
- అధిక శబ్దాలకు దూరంగా ఉంటే మంచిది
- పిల్లల వెంట తల్లిదండ్రులు ఉండాలి
- జాగ్రత్తలు పాటించాలంటున్న నిపుణులు



బాణాసంచా కాల్చుతున్న దృశ్యం (ఫైల్)



పత్తికొండలో టపాసుల విక్రయాలు

పత్తికొండ(తుగ్గలి)/కృష్ణగిరి: దీపావళి అంటేనే వెలుగుల పండుగ. అమావాస్య చీకట్లను చీల్చుతూ ఎటుచూసినా దీపాల సొబగులే. టపాసుల మోతతో సందడిగా ఉంటుంది. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా ఆనందోత్సాహాల మధ్య జరుపుకునే వేడుక ఇది. అలాంటి దీపావళి పండుగ ఆనందం ఎంత ఉంటుందో ప్రమాదం కూడా అంతే ఉంటుందని అగ్నిమాపక శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. దీపావళి పండుగను పురస్కరించుకుని బాణాసంచా కాల్చేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ పత్తికొండ అధికారి దినకర్‌బాబు సూచించారు.

లక్ష్మీదేవి ఆరాధన..

కోటికాంతుల దీపాలతో అమావాస్యను పటాపంచలు చేసే ఈ దీపావళి రోజునే లక్ష్మీదేవి తమ ఇంట్లో కలకాలం నిలవాలని లక్ష్మీపూజ జరపడం ఆచారం. గురువారం దీపావళి సందర్భంగా ఇళ్లల్లో లక్ష్మీదేవి పూజ చేస్తారు. ఇంట్లో ఉన్న బంగారం, నగదును అమ్మవారి చెంత ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. చీకట్లను పారద్రోలే విధంగా దీపాలను వెలిగించి పూజలు చేస్తారు. దీపారాధన అనేది పండుగలో ప్రత్యేకమైనది. ఇంట్లో దీపాలు వెలిగిస్తే సకల శుభాలు కలుగుతాయని నమ్మకం. లక్ష్మీదేవి దీపజ్యోతిగా, సంపదను దైవంగా భావిస్తుండటంతో అందరూ దీపావళి రోజు దీపాలను వెలిగిస్తారు.

జాగ్రత్తలు..

- టపాసులు ఆరుబయటే కాల్చాలి. ఇంట్లో కాల్చొద్దు.
- ఆస్పత్రులు, పెట్రోల్ బంకులు ఉన్న ప్రాంతాల్లో టపాసులు పేల్చొద్దు.
- పేలుడు ఎక్కువగా ఉండే మందుగుండు సామగ్రి కాల్చడానికి దూరంగా ఉండాలి.
- శబ్దం తక్కువగా ఉండే బాణసంచా కాల్చడం ద్వారా ధ్వని కాలుష్యం తగ్గే అవకాశం
- టపాసులు కాల్చే ముందు విధిగా పాదరక్షలు ధరించాలి. అందుబాటులో నీళ్లు ఉంచుకోవాలి. గాయాలు అయితే వెంటనే సమీపంలోని వైద్యులను సంప్రదించాలి.
- టపాసులు కాల్చేటప్పుడు చిన్నారులను ఒంటరిగా వదిలిపెట్టొద్దు. పెద్దల సమక్షంలోనే పిల్లలు టపాసులు కాల్చాలి. సరిగ్గా కాలని బాణాసంచాపై నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దు.
- కాటన్, వదులుగా ఉండే దుస్తులను ధరించాలి. కళ్లకు హాని కలగకుండా అద్దాలు వాడాలి.
- అగ్నిమాపకశాఖ వద్ద లైసెన్స్‌లు పొందిన దుకాణాల్లోనే బాణాసంచా కొనుగోలు చేయాలి.
- పర్యావరణ హితమైన పదార్థాలతో తయారు చేసిన గ్రీన్ కాకర్స్ ఉపయోగిస్తే మంచింది.
- దుకాణాల వద్ద ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా చర్యలు చేపట్టాలి.
- దుకాణాల వద్ద ఇసుక, నీరు, ఫైర్ ఎక్విప్‌మెంట్ అందుబాటులో ఉంచుకోవాలి.
- దుకాణానికి దుకాణానికి మధ్య మూడు మీటర్ల దూరం ఉండాలి.
- గ్రామాల్లో పూరి గుడిసెలు, గడ్డివాములు ఉన్న పరిస్థితులను గమనించాలి.
- రంగుల పొగల వెనుక ప్రమాదం ముప్పు..
- ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం అందించాలి.
- బాణాసంచా కాల్చడం వల్ల ఆ ప్రభావం సుమారు 72 గంటల పాటు గాలిలో ఉంటుంది. దీని వల్ల శ్వాసకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. టాక్సిన్ కాకాలైన రాగి, కాడ్మియం, సీసం, మెగ్నీషియం, జింక్, సోడియం, పొటాషియం, గంధకం వంటి పదార్థాల పొగతో అనర్థాలు ఎక్కువగా ఉంటాయి.
- టపాసుల్లో ఉండే సల్ఫర్, కార్బన్ వల్ల కళ్లకు ప్రమాదం అధికం. కళ్లమంట, దురద వంటి సమస్యలు తలెత్తుతాయి. ఇటువంటి పరిణామాలు ఏర్పడి వెంటనే వైద్యులను సంప్రదించాలి.

"జాగ్రత్తలు తీసుకోవాలి



టపాసులు కాల్చే సమయంలో చర్మానికి ఏదైనా కాలడం ద్వారా గాయం ఏర్పడితే తక్షణమే వైద్యులను సంప్రదించాలి. నిప్పు రవ్వలు పడిన వెంటనే చల్లటి నీటితో ఆ ప్రాంతంలో శుభ్రంగా కడగాలి. కాలిన గాయానికి గాలి ఆడేటట్లు చూడాలి. బర్నాల్ లేదా సల్ఫర్ డయాజిన్ కాలిన ప్రదేశంలో పూసి తక్షణమే వైద్యుడిని సంప్రదించాలి. అరిచేతులు. అరికాళ్లు, ముక్కు, కన్ను, మర్మాంగాలు, పిరుదల మధ్య కాలిన గాయాలైతే ఏ మాత్రం అశ్రద్ధ చేయకుండా తక్షణమే వైద్యుడిని సంప్రదించాలి.

– వై.ప్రదీప్, వైద్యాధికారి, కృష్ణగిరి

"అప్రమత్తంగా ఉండాలి



దీపావళి పండుగలో ఆనందం ఎంత ఉంటుందో ప్రమాదం కూడా అంతే ఉంటుంది. బాణాసంచా కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలను నివారించవచ్చు. ఏదైనా అగ్ని ప్రమాదం చోటు చేసుకుంటే వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వాలి.

– దినకర్‌బాబు, అగ్నిమాపక శాఖ అధికారి, పత్తికొండ

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం గిడ్డమ్మ, పీడీ వేణుగోపాల్



విద్యార్థి సాయికుమార్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం నిషార్ అహ్మద్

తుగ్గలి : రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు పగిడిరాయి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు బుధవారం ఫిజికల్ డైరెక్టర్ వేణుగోపాల్ తెలిపారు. ఇటీవల కర్నూలులో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ – 17 400 మీటర్ల పరుగు పందెంలో దిలీప్‌చౌదరి, ఖోఖోలో రవీంద్ర ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వచ్చే నెల 2నుంచి శ్రీకాకుళం, అనకాపల్లిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. విద్యార్థులను హెచ్‌ఎం గిడ్డమ్మ, ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీ చైర్మన్ గుండమయ్య అభినందించారు.

ఆలూరు: స్థానిక ప్రభుత్వ గిరిజన గురుకుల బాలికల పాఠశాల విద్యార్థిని బి.మాధవి త్వరలో ఏలూరు లో జరగనున్న రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొననుందని పాఠశాల ప్రిన్సిపాల్ షాహీనూర్ బుధవారంఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 12న కర్నూలులో డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ నిర్వహించిన పోటీల్లో బి.మాధవి ప్రతిభ చాటడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. అలాగే.. రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు పి.రేణుకాబాయ్, శాంతిబాయ్, హ్యాండ్‌బాల్ పోటీలకు ఎం.శ్రీలతబాయ్, ఎంపికయ్యారని పేర్కొన్నారు.

ఆస్పరి: మండలంలోని జొహరాపురం ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సాయికుమార్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపినట్లు పీడీ మహేంద్ర బుధవారం తెలిపారు. ఈనెల 26– 28వ తేదీ వరకు విజయవాడలో అండర్–17 విభాగం రాష్ట్ర స్థాయి సైకిల్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో సాయికుమార్ తృతీయ స్థానంలో నిలిచాడు. సాయికుమార్‌ను హెచ్‌ఎం నిషార్ అహ్మద్, ఉపాధ్యాయులు అభినందించారు.

పురిటినొప్పులతో గర్భిణి అవస్థలు



హొళగుంద పీహెచ్‌సీ వద్ద పురిటి నొప్పులతో బాధ పడుతున్న గర్భిణితో బంధువులు

హొళగుంద: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మొదటి కాన్పు కోసం పురిటినొప్పులతో వచ్చిన ఓ గర్భిణీకి సమయానికి వైద్యసేవలు అందక అవస్థలు పడిన సంఘటన బుధవారం ఉదయం చోటుచేసుకుంది. హొళగుందకు చెందిన చిన్ని అనే గర్భిణి పురిటినొప్పులతో బాధ పడుతుండగా కుటుంబ సభ్యులు ఉదయం 6.30 గంటల సమయంలో పీహెచ్‌సీకి తీసుకొచ్చారు. ఆ సమయంలో డాక్టర్లు లేకపోగా 9 గంటల వరకు వేచి చూసిన బంధువులు 9 గంటల సమయంలో నొప్పులు తీవ్రం కావడంతో అందుబాటులో ఉన్న నర్సులు గర్భిణి పరిస్థితిని చూసి ఆదోనికి తీసుకెళ్లాలని సూచించారు. అయితే నొప్పులు విపరీతంగా ఉన్నాయని ఇక్కడ చికిత్స అందించాలని కుటుంభ సభ్యులు, బంధువులు సిబ్బందితో కొద్దిసేపు వాగ్వాదానికి దిగారు. అయినా వారు ఆదోనికి తీసుకెళ్లాలని సూచించడంతో పీహెచ్‌పీకి చెందిన 108 కోసం కాల్ చేశారు. తాము దగ్గర్లో లేమని ప్రైవేటు వెహికల్‌లో తీసుకెళ్లాలని108 సిబ్బంది చెప్పారని బంధువులు ఎరుకల నాగరాజు చెప్పారు. కూలీనాలీ చేసుకుని బతికే తాము ప్రైవేటు వెహికల్‌కు అంత డబ్బు పెట్టుకుని ఎలా వెళ్లాలని గర్భిణి తల్లి బోడెమ్మ వాపోయింది. అయినా బంధువుల సహకారంతో కారును బాడుగకు తీసుకుని ఆదోనికి తీసుకెళ్లారు. అక్కడ కూడా పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తీసుకెళ్లాలని అక్కడి వైద్యులు సూచించినట్లు తెలిసింది. దీంతో కుటుంబ సభ్యులు గర్భిణిని స్థానికంగ ఉన్న ఓ ప్రైవేటు నర్సింగ్‌హోమ్‌కు తీసుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై డాక్టర్ న్యూటన్‌ను విచారించగా తాను సెలవులో ఉన్నానని, మరో డాక్టరు బిందుమాధవి ఆస్పత్రికి వస్తుండగా అంతలోపే ఈ సంఘటన జరిగిందన్నారు. గర్భిణీ పరిస్థితి సీరియస్‌గా ఉండడంతో ఆమెకు ఇక్కడ వైద్యం అందించే స్థాయి లేదని, అందుకే ఆదోనికి వెళ్లాలని సిబ్బంది సూచించారన్నారు. అయితే 108 విషయంలో తమకు ఎలాంటి సంబంధం ఉండదని తెలిపారు. తాము రెఫర్ మాత్రమే చేస్తామని చెప్పారు.

పారిశ్రామిక సందర్శనతో నైపుణ్యాభివృద్ధి

మద్దికెర : పారిశ్రామిక సందర్శన చేయడం వల్ల విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి తోడ్పడుతుందని ప్రిన్సిపాల్ సవిత అన్నారు. బుధవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో 9,10, 11,12 తరగతుల ఒకేషనల్, ఐటీఈఎస్, అగ్రికల్చర్ విద్యనభ్యసించే విద్యార్థులు మండల కేంద్రంలోని సచివాలయంలో సిబ్బంది విధులు, కెనరా బ్యాంకులో దొంగనోట్లు గుర్తించడం, బ్యాంకు ఉపయోగాల గురించి తెలుసుకున్నారు. ఒకేషనల్ శిక్షకులు బాబు, కార్తీక్ పాల్గొన్నారు.

సంతమార్కెట్‌లో పరిశుభ్రత పనులు

ఆలూరు: స్థానిక వారపు కూరగాయల సంత మార్కెట్ ఆవరణలో పేరుకుపోయిన చెత్త, చెదారం, ముళ్ల కంచెను అస్రా అసోషియేషన్ యువజన సంఘం నాయకులు బుధవారం తొలగించారు. సంఘం నాయకులు బూర్ల పవన్ కుమార్,కార్యదర్శి అంజినమ్మ మాట్లాడుతూ గ్రామస్తులు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామాన్ని శుభ్రంగా ఉంచడానికి తమ వంతుగా కృషి చేస్తామని చెప్పారు. చిరువ్యాపారులు సంత మార్కెట్‌లో చెత్త వేయకుడా చూసుకోవాలని కోరారు.

రూ.11.78కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీల పనులు

ఆలూరు: పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోని ఆరు మండలాల్లో వచ్చేనెల మొదటి వారంలోగా ఉపాధి హామీ పథకం కింద మంజూరైన నిధులు రూ.11.78 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీల పనులను ప్రారంభిస్తామని పంచాయతీ రాజ్ ఆలూరు డిప్యూటీ ఎగ్జక్యూటివ్ ఇంజనీర్ ఎస్.మనోహర్ బుధవారం తెలిపారు. వివిధ గ్రామాల్లో రోడ్ల పనులను పరిశీ లించిన అనంతరం ఆయన స్థానిక డీఈ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆలూరు మండలంలో 31 పనులకు రూ.2 కోట్లు, ఆస్పరి మండలంలో 41 పనులకు రూ.2 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. చిప్పగిరి మండలంలో 19 పనులకు రూ.1.80 కోట్లు, దేవనకొండ మండలంలో 30 పనులకు రూ.2 కోట్లు, హాలహర్వి మండలంలో 32 పనులకు రూ.2 కోట్లు, హొళగుంద మండలంలో 33 పనులకు రూ.2 కోట్లతో పనులు చేస్తామని వివరించారు. ప్రస్తుతం దేవనకొండ మండలం ఈదులదేరబండ గ్రామంలో రూ.10 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీల పనులను పూర్తిచేశామన్నారు.

రోడ్ల విస్తరణ చేపట్టాలి



ఆర్డీవోకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

పత్తికొండ(తుగ్గలి) : పట్టణంలోని ప్రధాన రోడ్డును విస్తరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య కోరారు. ఈ మేరకు ఆయన బధవారం పార్టీ నాయకులతో కలిసి ఆర్డీవో భరత్‌నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ..రోజురోజుకూ ట్రాఫిక్ ఎక్కువై ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. డివిజన్‌గా ఏర్పడిన తర్వాత ప్రభుత్వ కార్యాలయాలకు నిత్యం వేలాది మంది పట్టణానికి పనుల నిమిత్తం వస్తున్నారని, అత్యవసర సమయాల్లో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ, డ్రైనేజీలు, పుట్‌పాత్ నిర్మించడంతో పాటు కనీస వసతులు కల్పించాలని కోరారు. పార్టీ మండల కార్యదర్శి రాజాసాహెబ్, జిల్లా సమితి సభ్యులు గురుదాస్, కారన్న, ఎంపీటీసీ సభ్యుడు పెద్దఈరన్న పాల్గొన్నారు.

కౌమారుల మానసిక ఆరోగ్యంపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

మద్దికెర : 15–24 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులు ప్రతి 20 మంది కౌమారుల్లో ఒకరు డిప్రెషన్‌కు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని దీనికి కారణం లింగ వివక్షత, శారీరక, మానసిక మార్పులతో పాటు తీవ్ర ఒత్తిడికి గురి కావడమేనని ప్రభుత్వ వైద్యాధికారులు రాగిణి, శ్రీలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంలో కౌమారుల మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం కోసం యోగా, సమయానికి నిద్ర, సరైన పౌష్టికాహారం తీసుకోవడం, మంచి సామాజిక సంబంధాలను కొనసాగించడం, మంచి అలవాట్లు, ఆటపాటలు సృజనాత్మకతను పెంచుకోవడంతో పాటు వైద్యులు సలహాలు పాటించాలని సూచించారు. సీహెచ్‌ఓ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, హెల్త్ ఆఫీసర్లు మంజరుల, ఐశ్వర్య, అంజలి పాల్గొన్నారు.

యురేనియం తవ్వకాలు చేపట్టొద్దు



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

దేవనకొండ: కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టులో ప్రజలకు హానీ కలిగించే యురేనియం తవ్వకాలను చేపట్టరాదని సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి ఎం.నరసారావు, ఏపీ రైతుసంఘం మండల గౌరవాధ్యక్షుడు వై.కందప్ప డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ మండల శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ యురేనియం తవ్వకాలకు చర్యలు తీసుకుంటున్నట్లు వస్తున్న వార్తలపై పరిసర గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారన్నారు. రాజశేఖర్, శేఖర్, వీరాంజనేయులు, భాస్కర్, రవితేజ, భరత్, సురేంద్ర పాల్గొన్నారు.

దేవనకొండను కరువు మండలంగా ప్రకటించాలి

దేవనకొండ: మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సీపీఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్, మండల కమిటీ సభ్యుడు అశోక్, యూసుఫ్‌బాషా డిమాండ్ చేశారు. బుధవారం వారు మాట్లాడుతూ శాస్త్రీయత లేకుండా ప్రభుత్వం కరువు మండలాల జాబితాను ప్రకటించిందని మండిపడ్డారు. తీవ్ర కరువుతో ప్రజలు అల్లాడుతున్న పరిస్థితులు కనిపించలేదా అని ప్రశ్నించారు. వెంటనే ప్రభుత్వం పునరాలోచించి మండలాన్ని కరువు జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు.

అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి



బి.విరూపాక్షి, ఆలూరు ఎమ్మెల్యే



కంగాటి శ్రీదేవి

ఆలూరు: దీపావళి పండుగ ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి ఆకాంక్షించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ, వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు,ప్రజాప్రతినిధులు,ప్రజాసంఘాల నాయకులు, అధికారులు, సిబ్బందికి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరారు.

కృష్ణగిరి: అజ్ఞానం అనే చీకట్లను తరిమి వెలుగులు నింపే పర్వదినమే దీపావళి పండుగ అని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. బుధవారం ఆమె ప్రజలకు దీపావళి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ దీపావళి ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ఆనందాన్ని ఇచ్చే ఈ పండుగ కుల,మతాలకతీతంగా సంతోషంగా జరుపుకోవాలని కోరారు.

నేడు హొళగుందకు ఎమ్మెల్యే రాక

హొళగుంద: మండల కేంద్రానికి ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి గురువారం రానున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా బుధవారం తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తారని చెప్పారు.జెడ్పీ వైస్ చైర్మన్, వైస్ ఎంపీపీలు, ఎంటీపీసీలు, సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరవ్వాలని కోరారు.

హాలహర్వి: స్థానిక క్షేత్రగుడి ఆంజనేయస్వామి సన్నిధిలో గురువారం ఉదయం 9 గంటలకు ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి కార్యకర్తలతో సమావేశమవుతారని మండల కన్వీనర్ రామిరెడ్డి, కో–కన్వీనర్ మల్లికార్జున బుధవారం తెలిపారు. మండలంలోని ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు, జెడ్పీటీసీ, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

2న ఆలూరులో జాబ్ మేళా

ఆలూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నవంబర్ 2వ తేదీన జిల్లా వృత్తినైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆనందరాజ్‌కుమార్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.రమాదేవి ఆధ్వర్యంలో జాబ్‌మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలూరు ఏరియా కో–ఆర్డినేటర్ వీరేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 : 20 నుంచి సాయింత్రం 4.50 గంటల వరకు వివిధ కంపెనీల హెచ్‌ఆర్‌లు నిర్వహించే ఇంటర్వ్యూలకు డీగ్రీ , పీజీ, ఐటీఐ, పాలిటెక్నికల్, ఇంజినీరింగ్ తదితర కోర్సులు పూర్తి చేసిన వారు, పది ఫేయిల్ అయిన 18 – 35 ఏళ్ళ వయస్సు లోపు అర్హలని పేర్కొన్నారు. హాజరయ్యే అభ్యర్థులు ఒరినల్ సర్టిఫికెట్లతోపాటు 4 పాస్‌పోటోలు, 2 జతలు జిరాక్స్‌లతో రావాలని సూచించారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

వెల్దుర్తి(కృష్ణగిరి): రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో గ్రామసభల ద్వారా భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు మండల సర్వేయర్ హేమంత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బోగోలు గ్రామంలో బుధవారం సర్పంచ్ అమర్నాథ్‌గౌడ్ అధ్యక్షతన రీ సర్వేపై నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. రైతులు ఫిర్యాదు చేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

రైతులు పంటల బీమా చేయించుకోవాలి

హాలహర్వి: రబీ సీజన్‌లో పంటలను సాగుచేసిన రైతులు తప్పనిసరిగా పంటలకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని ఏఓ శివశంకర్ సూచించారు. బుధవారం మండలంలోని కామినహాల్, మెదేహాల్ గ్రామాల్లో వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ రబీ సీజన్‌లో వేసిన పంటలకు కామన్ సర్వీస్ సెంటర్ వద్దకు వెళ్లి శనగ, జొన్న పంటకు బీమా చేయించుకోవాలన్నారు. దీని వల్ల వాతావరణం మార్పులు చోటు చేసుకొని పంటలు నష్టపోతే బీమా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. పప్పుశనగకు ఎకరాకు రూ.420, జొన్న పంటకు ఎకరాకు రూ.297, వేరుశనగకు ఎకరాకు రూ.480, వరి పంటకు ఎకరాకు రూ.630 చొప్పున ప్రీమియం చెల్లించాలని చెప్పారు. ఏఈఓ శ్రీకాంత్, ఎంపీఈఓ సూరన్న, రైతులు ఉన్నారు.

అంటరానితనం నిర్మూలనపై సదస్సు

హాలహర్వి: స్థానిక ఆర్డీటీ భవనంలో బుధవారం అంటరానితనం నిర్మూలనపై తహసీల్దార్ నజ్మాబాను ఆధ్వర్యంలో సదస్సును నిర్వహించారు. ఎస్సీ కాలనీలోని ప్రజలకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ మాట్లాడుతూ సమాజంలో అందరూ ఒకటే అని, అన్నదమ్ముల్లాగా కలిసి మెలసి ఉండాలన్నారు. ఎస్‌ఐ చంద్ర, ఆర్‌ఐ మహేష్, సర్పంచ్ మల్లికార్జున, వీఆర్వో కాశీం పాల్గొన్నారు.